క్లుప్తంగా

కనులపండువగా సీతారాముల కల్యాణం



కల్యాణం అనంతరం దేవతామూర్తులు

మర్కూక్(గజ్వేల్): పునర్వసు నక్షత్ర మహోత్సవంతో పాములపర్తి కోదండరామాలయం అలరారింది. సీతారామచంద్రమూర్తుల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మంగళవారం ఉదయం వేదపండితులు సనాతన సారథి, అర్చకుడు అనీష్ త్రిపాఠి నేతృత్వంలో వేడుకలు మొదలయ్యాయి. మూలవిరాట్టులకు విశేష అభిషేకం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ మంగమ్మ, రామచంద్రం దంపతులు కల్యాణదాతలుగా క్రతువు నిర్వహించారు.

ఆధ్యాత్మికతోనే ప్రశాంతత



పుస్తకం ఆవిష్కరిస్తున్న జడ్జి స్వాతిగౌడ్ తదితరులు

గజ్వేల్‌రూరల్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో పయనించి మానసిక ప్రశాంతత పొందాలని గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ సివిల్ జడ్జి స్వాతిగౌడ్ సూచించారు. భద్రాచల దేవస్థానం నుంచి శ్రీరామకోటి భక్తసమాజానికి అందిన శ్రీరామరక్ష స్తోత్ర పారాయణ పుస్తకాలను మంగళవారం స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో ఆవిష్కరించారు. అఖిల భారత సమరసతా కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్, సామాజిక సమరసత రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆకుల నరేశ్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళితో కలిసి జడ్జి ఆవిష్కరించారు.

ట్రాఫిక్ ఇబ్బందులు కలగొద్దు



మాట్లాడుతున్న ఏసీపీ సుమన్‌కుమార్

సిద్దిపేటకమాన్: వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకులు పార్కింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకొని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ ఆదేశించారు. ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో వైన్ షాపులు, బార్‌ల యజమానులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్టమర్ల వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ప్రదేశం, సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని, 30 రోజుల ఫుటేజీ తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. సీఐలు ప్రవీణ్‌కుమార్, వాసుదేవరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి తదితరులు

అక్కన్నపేట(హుస్నాబాద్): రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం రాయితీపై అందించే మొక్కజొన్న విత్తనాల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ చందు, సింగిల్ విండో వైస్ చైర్మన్ ఐలయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అయిలయ్య, మండల వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, ఏఈఓ సింధూజ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఎప్పుడు?



సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

సిద్దిపేటరూరల్: ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ప్రశ్నించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో మంగళవారం సమస్యల సేకరణతోపాటు, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల విషయంలో ప్రభుత్వం మాట తప్పడం దారుణం అన్నారు. 2023 జూలై నుంచి రావాల్సిన పీఆర్‌సీని వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలన్నారు. అబ్దుల్ అజీజ్, శ్రీనివాస్, రాజు, రాందాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, గౌతమి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

బడిలేక.. బాధలు తీరక

అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నామని చెప్పడానికి గిరిజన గ్రామాలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. మండలంలోని ఆ తండాల్లో సర్కారు బడి లేదు. చదువుకోవాలంటే ఆటోలో ఐదు కిలోమీటర్లు ప్రయాణించవల్సిందే. ఇది మండలంలోని సేవాలాల్ మహరాజ్, బంగారులొద్దితండాలలో దుస్థితి. చదువుకోడానికి ఆ చిన్నారులు ప్రతిరోజు సాహసం చేయాల్సివస్తోంది.

- ఐదు కిలోమీటర్లు వెళ్లాల్సిందే..
- అర్ధంతరంగా నిలిచిన నిర్మాణం
- కన్నెత్తి చూడని అధికారులు
- చిన్నారులకు తప్పని తిప్పలు



సేవాలాల్ మహరాజ్‌తండాలో నిలిచిపోయిన బడి నిర్మాణం

అక్కన్నపేట(హుస్నాబాద్): సేవాలాల్‌మహరాజ్ తండా పరిధిలోని బంగారులొద్దితండాలో గతంలో ప్రభుత్వ బడి ఉండేది. అయితే ఆ భవనం పాత బడిందన్న సాకుతో దానిని మూసివేశారు. గౌరవెల్లి భూ నిర్వాసితులంతా బంగారులొద్దితండాకు అనుకొని పునరావాస కాలనీగా నివాసం ఏర్పచుకున్నారు. ప్రస్తుతం సేవాలాల్ మహారాజ్‌తండా గ్రామంగా ఆవిర్భావించింది. దీంతో ఇక్కడ 351 కుటుంబాల వారు నివాసం ఏర్పచుకొని జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ తండాల్లో ప్రభుత్వ బడి లేదు. దాదాపుగా రెండు, మూడేళ్ల కావస్తున్నా పట్టించుకొనే నాథుడే లేకుండా పోయాడు.

చిన్నారులకు తప్పని తిప్పలు

సేవాలాల్, బంగారులొద్దితండాల నుంచి పిల్లలు రామవరంలో ఉన్న ప్రభుత్వ బడికి వెళ్లాల్సివస్తుంది. అంటే వారి తండాల నుంచి సుమారు 5 కిమీ దూరం ఉంటుంది. ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.500 చొప్పున చెల్లిస్తూ ఆటోలో బడికి పోవాల్సిన పరిస్థితి. ఇలా దాదాపు 14 మంది సర్కారు బడికి వెళ్తుండగా.. మరో 20 మందికి పైగా పిల్లలు ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్నారు. తాము ఎలాగా చదువులకు దూరమయ్యామని, తమ పిల్లలకైనా విద్య అందించాలని ఆర్థికభారాన్ని మోస్తూ పిల్లలను చదివించుకొంటున్నామని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నిలిచిపోయిన పాఠశాల నిర్మాణం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పునరావాసకాలనీలో పాఠశాల, గుడి ఇలా తదితర సౌకర్యాలు కల్పించవలసి ఉంటుంది. కానీ ఇక్కడ పాఠశాల నిర్మాణ పనులు ఆగిపోయి దాదాపు ఏడాదిన్నర దాటుతోంది. అయినా ఎవరూ పట్టించుకున్న పాపాన పోవడంలేదు. దీంతో ఆ భవనంలో రోడ్డు విస్తరణ పనులు చేస్తున్న కూలీలు ఉంటున్నారు. ఇకనైనా తాత్కాలిక భవనాన్ని అద్దెకు తీసుకొనైనా పాఠశాల ఏర్పాటు చేయాలని తండావాసులు కోరుతున్నారు.

పాఠశాల ఏర్పాటు చేయాలి



తండాలో ప్రభుత్వ బడి లేదు. గతంలో బంగారులొద్దితండాలో ఉండేది. కానీ ఆ భవనం మంచిగా లేదని ఉపాధ్యాయులు రావడం లేదు. దీంతో పిల్లలు రామవరం గ్రామంలోని పాఠశాలకు ఆటోలో వెళ్తున్నారు. తండాలో పాఠశాలను ఏర్పాటు చేయాలి. అలాగే నిలిచిన బడి నిర్మాణ పనులను పూర్తి చేయించాలి.

– భానోతు భాస్కర్‌నాయక్, బంగారులొద్దితండా

పౌష్టికాహారమే ఆరోగ్యానికి మేలు



దౌల్తాబాద్(దుబ్బాక): అవగాహన కల్పిస్తున్న రేఖ

దౌల్తాబాద్(దుబ్బాక): పౌష్టికాహారమే ఆరోగ్యానికి మేలని దుబ్బాక ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ రేఖ అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ హెల్త్ సూపర్‌వైజర్ అమరావతి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం జ్యోతి, జిల్లా పరిరక్షణ భాగం కౌన్సిలర్ నరసింహులు, అంగన్‌వాడీ టీచర్లు, రమాదేవి, గిరిజ, ప్రతిభ, రాధిక, సరోజ తదితరులు పాల్గొన్నారు.

పోషకాలు కలిగిన ఆహారం తీసుకోవాలి

దుబ్బాకరూరల్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీర్‌పూర్ గ్రామంలో మహిళలకు సీడీపీఓ ఎల్లయ్య పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, కిషోర బాలికలు మంచి పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకళ, శ్యాంసన్, ఏఎన్‌ఎం జయంతి, అంగన్‌వాడీ టీచర్లు పద్మలత, నాగలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

ఎంఈఓ కృష్ణ



వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించాలని ఎంఈఓ అన్నారు. ప్రజ్ఞాపూర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఉమ్మడి జిల్లా వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ సౌందర్యతో కలిసి ఆయన మాట్లాడారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడుతాయన్నారు. క్రీడలో రాణించినపుడే మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ పోటీలలో విజేతలైన వారిని ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపిక చేస్తారని, వారు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీ భవాని, పీడీలు విజయరేఖ, రాజిరెడ్డి, ఎలియాస్ రావు, రాజ్‌కుమార్, లక్ష్మీనారాయణ, నాగేశ్, గోవర్ధన్‌రెడ్డి, నరేష్, కనకయ్య, ప్రశాంత్, నాయకులు శివకుమార్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

డీఆర్డీఓ జయదేవ్ ఆర్య

కోహెదరూరల్(హుస్నాబాద్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మాత్రమే ధాన్యం విక్రయించుకోవాలని డీఆర్డీఓ జయదేవ్ ఆర్య సూచించారు. మండలంలోని శనిగరం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట ఏపీఎం శ్రీనివాస్, సీసీ సంపత్ పాల్గొన్నారు.



గోనెపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి, ఇబ్రహీంనగర్, ఎల్లాయపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే తూకం వేయడంలో ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో సీసీలు, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థులు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని మెదక్, సంగారెడ్డి పట్టణాలలో సోమవారం జరిగిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీలలో విద్యార్థులు సత్తాచాటారు. ఆయా విద్యార్థులను ఎంఈఓలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.



సిద్దిపేటలో విద్యార్థులు జస్వంత్, అభిషేక్‌ను అభినందిస్తున్న ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాకటౌన్: రంగ, భానును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి



హుస్నాబాద్: శాన్వీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



దౌల్తాబాద్(దుబ్బాక): రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దుబ్బాకటౌన్: ప్రతిరోజు ధ్యాన సాధన చేయడం ద్వారానే మానసిక, శారీరక రుగ్మతలు తొలగుతాయని బ్రహ్మవిద్యర్షి, భీమవరం పీఎంసీ సీనియర్ పిరమిడ్ మాస్టర్ తటవర్తి రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక ఆర్యవైశ్య భవన్‌లో శ్రీకృష్ణ పిరమిడ్, దుబ్బాక పీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత ధ్యాన, ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్లు అంబటి కమల, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు

చిన్నకోడూరు(సిద్దిపేట): మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య ఇటీవల మృతి చెందారు. మండల పరిధిలోని గంగాపూర్‌లోని ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్ కుమార్, రవీంద్ర కుమార్, పైళ్ల శేఖర్ రెడ్డి, భిక్షమయ్య గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు బాలమల్లు, శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ శర్మ మంగళవారం ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను ఓదార్చారు.

పరిశ్రమలతో అనారోగ్య సమస్యలు

అధికారులకు స్థానికుల ఫిర్యాదు



మున్సిపల్ కమిషనర్ ఆశ్రితకు వినతిపత్రం అందిస్తున్న వార్డు ప్రతినిధులు

సిద్దిపేటజోన్: స్థానిక 15వ వార్డు సమీపంలోని రైస్‌మిల్, క్రషర్, చింతగింజల మిల్లు లాంటి పరిశ్రమలతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, దుమ్ము, ధూళి వల్ల అనారోగ్యానికి గురవుతున్నారని వార్డు ప్రజాప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. వార్డు కౌన్సిలర్ సులోచన ఆధ్వర్యంలో సిద్దిపేట ఆర్డీఓ సదానందం, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌లను కలిసి మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. వార్డు పరిసరాల్లో సిరిసిల్ల రహదారికి రెండువైపులా వివిధ పరిశ్రమలు ఉన్నాయని, సంబంధించిన వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి రేగి ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సంబంధించిన యాజమాన్యాలకు సమస్యలపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంజీవ్‌రెడ్డి, గౌరీ శంకర్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, కుంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి రవీందర్



హుస్నాబాద్: మొక్కజొన్నను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

హుస్నాబాద్: వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని వెంటనే ప్రారంభించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డులో ఆరబోసిన మొక్కజొన్నను మంగళవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోతలు ప్రారంభమై 10 రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించలేదన్నారు. క్వింటాలు మొక్కజొన్నకు ప్రభుత్వ మద్దతు ధర రూ.2,400 ఉంటే, వ్యాపారులు రూ.2 వేలకే కొనుగోలు చేస్తున్నారని వాపోయారు. నాయకులు వేల్పుల రాజు, ఎలగందుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ..

గజ్వేల్‌రూరల్: మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఏఎంసీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ కోరారు. గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడే అన్నదాతలు అకాల వర్షాలతో దిగుబడులు తగ్గి ఆందోళనలో ఉన్నారని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు మొక్కజొన్నలను కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో దళారులు రూ.400 నుంచి రూ.500 తక్కువగా కొనుగోలు చేయడం వల్ల అన్నదాతలు నష్టపోతున్నారని వాపోయారు. బీఆర్‌ఎస్ నాయకులు రమేష్‌గౌడ్, ఉమర్, శివకుమార్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల స్వచ్ఛ భారత్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వాలంటీర్లు

వర్గల్(గజ్వేల్): మండల కేంద్రం వర్గల్‌లో మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాల విద్యార్థినుల వారం రోజుల ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయ సేవా పథకం) క్యాంపు ప్రారంభమైంది. ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పాండు ఆధ్వర్యంలో 45 మంది వాలంటీర్లు జెడ్పీహైస్కూల్ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించి పిచ్చిమొక్కలు తొలగించారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటడం, మెడికల్ క్యాంపు నిర్వహిస్తారని స్వప్న తెలిపారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధమే బహుజనులకు బాసట

డీబీఎఫ్ రాష్ట్ర నేత ఏగొండ స్వామి



బుద్ధుడి విగ్రహం వద్ద దమ్మచక్ర పరివర్తన దివాస్

గజ్వేల్‌రూరల్: బహుజనుల బతుకులకు బాసటగా నిలిచేది బౌద్ధమేనని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి, జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు అన్నారు. దేశంలో బౌద్ధాన్ని పునఃస్థాపించాలనే సంకల్పంతో బీఆర్ అంబేడ్కర్ దమ్మదీక్షబూని నేటికి 69 యేళ్లు కావస్తున్న సందర్భంగా వారు కోమటిబండ సమీపంలోగల బుద్ధుడి విగ్రహం వద్ద దమ్మచక్ర పరివర్తన దివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక అసమానతలను నిర్మూలించడానికి బౌద్ధం ఏకైక పరిష్కారమన్నారు. 1956 అక్టోబర్ 14న నాగాపూర్‌లోని దీక్షాభూమి వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 5 లక్షల మంది అనుచరులతో కలిసి బౌద్ధదీక్ష తీసుకున్న రోజును దమ్మచక్ర పరివర్తన దివాస్‌గా జరుపుకుంటున్నట్లు గుర్తు చేశారు.

ఏఐఎస్‌ఎఫ్‌తోనే విద్యారంగ సమస్యల పరిష్కారం

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరేశ్

చేర్యాల(సిద్దిపేట): అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్‌ఎఫ్)తోనే విద్యారంగ సమస్యలకు పరిష్కారం సాధ్యమని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రామగళ్ల నరేశ్ అన్నారు. పట్టణ కేంద్రంలో వివిధ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో మంగళవారం ఏఐఎస్‌ఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు ద్వారా విద్యార్థులను ఉద్యమాల్లో భాగస్వాములు చేస్తున్నామన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి వారిని సంఘటితం చేయడమే లక్ష్యమన్నారు. విద్యార్థులు డ్రగ్స్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ లాంటి వాటికి దూరంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు యాసిన్, ప్రశాంత్, అభినయ్, శ్రీరామ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ

చేర్యాల(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రణీత తెలిపారు. మంగళవారం శిక్షణ తరగతులను ప్రారంభించిన అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వ అనుబంధ సంస్థ సెట్విన్ ఆధ్వర్యంలో మూడు నెలల పాటుఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పత్తి రైతులకు అందని మద్దతు ధర



పందిళ్లలో పత్తిని పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: పత్తి రైతులకు ప్రభుత్వ మద్దతు ధర చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకుడు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. పందిళ్లలోని బాలాజీ కాటన్ మిల్లులో పత్తికొనుగోళ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పత్తికి రూ.8,100 మద్దతు ధర ప్రకటిస్తే వ్యాపారులు రూ.4,500 నుంచి రూ.5 వేలు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. ఒక్కొక్క క్వింటాలుకు రూ.3వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ అధికారులు పత్తి మిల్లులో కొనుగోళ్లను పరిశీలించి రైతులకు మద్దతు ధర కల్పించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు గిట్టుబాటు ధర వస్తుందని అధికారులు సీసీఐ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి, వికాస్ తదితరులు ఉన్నారు.

మల్లన్న సాగర్ సందర్శన

కొండపాక(గజ్వేల్): కొండపాక, కుకునూరుపల్లి మండలాల సరిహద్దులో 50 టీఎంసీల సామర్థ్యంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్మించిన మల్లన్నసాగర్ ప్రాజెక్టును మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల రాజశేఖర్‌రెడ్డి, గ్యాదరి కిషోర్ మంగళవారం సందర్శించారు. ప్రస్తుతం సుమారు 25 టీఎంల నీరు నిల్వ ఉండటంతో లీకేజీలు, ఇతర లోపాల గురించి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడి నుంచి చిన్న చిన్న ప్రాజెక్టులకు కాలువల ద్వారా నీరు వెళ్లేలా నిర్మించారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాలమల్లు, కిరణ్‌కుమార్‌చారి, కనకయ్య, రవీందర్‌రెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.